నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, శనివారం 21 డిసెంబర్ 2024 | MAHABUBABAD

కేటీఆర్‌ను కలిసిన ఎర్రబెల్లి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా ఏసీబీ కేసు నమోదు చేసిన సందర్భంగా ఆయనను హైదరాబాద్‌లో కలిసి పలు విషయాలపై చర్చించారు.

- హనుమకొండ, డిసెంబర్ 20

కేసులు ఎత్తివేయాలి

అంబేద్కర్ చౌరస్తాలో ధర్నాచేస్తున్న గండ్ర, బీఆర్ఎస్ శ్రేణులు

- *అక్రమ అరెస్టులకు భయపడేది లేదు*
- *రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది బీఆర్ఎస్సే*
- *ఫార్ములా-ఈ కార్ రేసుతో రూ.700 కోట్ల లాభం*
- *ప్రభుత్వం అసెంబ్లీలో ఎందుకు చర్చించడం లేదు*
- *పేదల తరపున ప్రభుత్వాన్ని నిత్యం ప్రశ్నిస్తాం*
- *మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి*
- *భూపాలపల్లిలో ధర్నా.. ఉద్రిక్తత*

కృష్ణకాలనీ, డిసెంబర్ 20: ఐటీ రంగంలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరాల జాబితాలో చేర్చిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసులను వెంటనే ఎత్తివేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ పెట్టే కేసులకు, అక్రమ అరెస్ట్‌లకు భయపడేది లేదన్నారు. కేటీఆర్‌పై ఏసీబీ పెట్టిన కేసులను ఖండిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. హైదరాబాద్ ఇమేజీని ప్రపంచ స్థాయికి తీసుకుపోవాలనే ఉద్దేశంతో ఫార్ములా ఈ-కార్‌ను నిర్వహించారని, దీంతో రూ.700 కోట్ల లాభం వచ్చిందన్నారు. ఈ విషయమై అసెంబ్లీలో చర్చిద్దామని కేటీఆర్ ప్రతిపాదిస్తే ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదో చెప్పాలన్నారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఏడాది నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, మిగతా మంత్రులు ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తదితరుల అరెస్ట్ చేసి వారి గొంతులు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇటీవల లగచర్లలో ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నించినందుకు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి 35 రోజులు జైల్లో పెట్టారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్ని కేసులు పెట్టినా 6 గ్యారెంటీలు, 420 హామీలు నెరవేర్చేంతవరకు బీఆర్ఎస్ పేదల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుందన్నారు. కాగా, ధర్నాచేస్తున్న గండ్రను పోలీసులు అరెస్ట్ చేసేందుకు యత్నించగా బీఆర్ఎస్ శ్రేణులు, యూత్ నాయకులు అడ్డుకోగా కొద్దిసేపు తోపులాట జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది. అయినప్పటికీ పోలీసులు గండ్రను పోలీసు వాహనం ఎక్కించగా దానిని కదలకుండా అడ్డుకున్నప్పటికీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై గండ్రతో పాటు పార్టీ శ్రేణులను విడుదల చేశారు. ధర్నా సందర్భంగా

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు

గంట సేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు చేసిన నినాదాలతో భూపాలపల్లి దద్దరిల్లింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్‌యాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్, అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, కౌన్సిలర్లు కొత్త హరిబాబు, మంగళపల్లి తిరుపతి, ముంజంపల్లి మురళీధర్, ఆకుదారి మమత, దార పూలమ్మ, ఎడ్ల మౌనిక, జక్కం రవికుమార్, బానోత్ రజిత, మేకల రజిత, మాజీ జడ్పీటీసీలు గొగ్గె సాగర్, జోరుక సదయ్య, మాజీ ఎంపీపీ కళ్లెపు రఘుపతిరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మందల విద్యాసాగర్ రెడ్డి, నాయకులు బండారు రవి, బీబీ చారి, పొలుసాని లక్ష్మీనరసింహారావు, దొంగల ఐలయ్య, పోలవేను అశోక్, ప్రవీణ్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తితో సఖ్యతా?

- *విచారణాధికారిగా వెళ్లి ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొంటారా?*
- *వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్‌కు కలెక్టర్ నోటీసులు*
- *రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం*
- *కాంగ్రెస్ నేత కొండాతో కలిసి ప్రెస్‌మీట్ నేపథ్యంలో చర్యలు*

ప్రెస్‌మీట్‌లో కొండాతో తహసీల్దార్ ఇక్బాల్(ఫైల్)

వరంగల్, డిసెంబరు 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అధికార విధుల కన్నా కాంగ్రెస్ నేతలతో సఖ్యతకు ప్రాధాన్యత ఇచ్చిన వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్‌పై వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద చర్యలకు ఉపక్రమించారు. అజంజాహి మిల్లు కార్మిక భవన్ కబ్జా వ్యవహారంలో మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళీధర్‌రావుతో కలిసి ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ఆయన వ్యవహారంపై కలెక్టర్ సీరియస్‌గా స్పందించారు. ప్రభుత్వ భూమి కబ్జా విషయంలో విచారణాధికారిగా ఉన్న తహసీల్దార్ ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నేతతో కలిసి ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన తీరుపై వివరణ ఇవ్వాలని ఇక్బాల్‌కు కలెక్టర్ నోటీసు ఇచ్చారు. విచారణ అధికారిగా వెళ్లి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితో కలిసి ప్రెస్‌మీట్‌లో పాల్గొనడం ఏమిటని, దీనిపై రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

అజంజాహి మిల్లు కార్మిక భవనం కబ్జా వ్యవహారంలో ఆలస్యంగా అయినా అధికారులు చర్యలు చేపట్టారు. మంత్రి భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అండదండలతో ఓ ప్రైవేట్ వ్యాపారి అజంజాహి మిల్లు కార్మిక భవన్ కబ్జా కోసం చేసిన ప్రయత్నాలపై 'నమస్తే తెలంగాణ' వరుసగా కథనాలను ప్రచురించింది. కలెక్టర్ సత్యశారద ఆదేశాలతో వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ గురువారం కార్మిక భవనం స్థలాన్ని పరిశీలించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 75 ఏండ్లుగా కార్మికుల కోసం ఉన్న భవనం కబ్జా పర్వానికి తహసీల్దార్ ఆదేశాలతో తాత్కాలికంగా అడ్డుకట్ట పడింది. 1,450 గజాల భూమిని కార్మికులకు దూరం చేసేందుకు అందులో ఉన్న భవనాన్ని కూల్చి వేసి అక్కడ ఓ వ్యాపారితో కలిసి కొండా మురళీధర్‌రావు కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం సోమవారం భూమి పూజ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ విషయమై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు విచారణ కోసం వెళ్లిన తహసీల్దార్ ఇక్బాల్ ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నేతతో కలిసి ప్రెస్ మీట్‌లో పాల్గొన్నారు. దీంతో మిల్లు స్థలం పరిరక్షణపై కార్మికుల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో తహసీల్దార్‌కు కలెక్టర్ నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

వివరాలు తెలిపేందుకు వెళ్లా..

కాశీబుగ్గ : అజంజాహి మిల్లు కార్మికుల భవనం స్థలం కబ్జాకు గురైనట్లు ఫిర్యాదు రావడంతో దానిని పరిశీలించాను. శాంతి భద్రతలకు భంగం కలుగకుండా ఉండేందుకు మంత్రి కొండా సురేఖ ఆదేశాలు జారీ చేయగా ఆ వివరాలు తెలిపేందుకు వెళ్లిన క్రమంలో అక్కడ జరుగుతున్న విలేకరుల సమావేశంలో పాల్గొన్నాను. నేను ఉద్దేశపూర్వకంగా పాల్గొన లేదు. కేవలం సమాచారం అందించేందుకు మాత్రమే వెళ్లాను. కార్మికులతో మాట్లాడి ఆ వివరాలను ఉన్నతాధికారులకు అందించాను.

- ఇక్బాల్, వరంగల్ తహసీల్దార్

సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే మరో ఉద్యమం

ఫార్ములా ఈ రేసుపై చర్చంటే ముఖం చాటేస్తున్న సీఎం

- *కుట్రల కాంగ్రెస్ కొత్తనాటకానికి తెర*
- *ఏడాదిగా కేటీఆర్ అరెస్ట్ అంటూ లీకులు*
- *రాష్ట్ర పరువు తీస్తున్న రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టాలి*
- *బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్*
- *మాజీ ఎమ్మెల్యేలు పెద్ది, చల్లా, నన్నపునేనితో కలిసి విలేకరుల సమావేశం*

హనుమకొండ, డిసెంబర్ 20: మాజీ మంత్రి కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే తెలంగాణ లాంటి మరో ఉద్యమాన్ని శాంతియుతంగా చేపడుతామని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచ పటంలో తెలంగాణను నిలిపిన కేటీఆర్‌పై కాకుండా రాష్ట్ర పరువు తీస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టాలని అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాళేశ్వరం, విద్యుత్ స్కాం, ఫోన్ ట్యాపింగ్ అంటూ.. ఇ క అసత్య ఆరోపణలు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదన్నారు. తాజాగా ఈ-ఫార్ములా రేసులో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఇందుకు బాధ్యులైన కేటీఆర్ అరెస్ట్ అంటూ కుట్రల కాంగ్రెస్ కొత్తనాటకం ఆడుతున్నదని ఆరోపించారు. ఏడాదిగా కేటీఆర్ అరెస్ట్ అంటూ లీకులు, అసత్య ప్రచారాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 420 హామీలు, 6 గ్యారెంటీల అమలును మరిచి, మూసీ, లగచర్ల, హైడ్రాల వంటి కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్, కేటీఆర్ పోరాటం చేస్తుంటే అక్రమ కేసులు పెడుతున్నదని ఆరోపించారు. ఈ ఫార్ములాలో అవినీతి జరి గిందని కేటీఆర్‌పై ఏసీబీ కేసుపెట్టడం ప్రభుత్వ ప్రోద్బలంతోనే అని స్పష్టమవుతోందని అన్నారు. అక్రమ కేసులకు భయపడమని, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోనే నిలదీస్తామని హెచ్చరించారు. ఫార్ములా ఈ రేసులో సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చర్చ పెట్టడానికి ఎందుకు ముఖం చాటేస్తున్నారని ప్రశ్నించారు. అక్రమంగా అరెస్ట్ చేసినా జైలుకు వెళ్లేందుకు కేటీఆర్ సిద్ధంగా ఉ న్నారన్నారు. న్యాయ వ్యవస్థలపై నమ్మకం ఉందని అన్నారు. సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, పశ్చిమ నియోజకవర్గం కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, ఎల్లావుల లలితాయాదవ్, బీఆర్ఎస్ నాయకులు శోభన్, నయీముద్దీన్, రవీందర్‌రెడ్డి, వెంకన్న, పోలపల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే కేసులా?

అవినీతిని ప్రశ్నిస్తే కేసుల పాలు చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబునాయుడి చమ్చా. సీఎం హైదరాబాద్ ఇమేజ్‌ని దెబ్బతీస్తున్నాడు. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే నీ సంగతి చూస్తాం బిడ్డా రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ పాలనలో అవినీతి పెచ్చుమీరింది. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు కబ్జాలకు తెగబడుతున్నారు. ఈ జిల్లా మంత్రుల తీరు ఏమో అజంజాహి మిల్లు జాగా, వేముల వాడ కోడెల లొల్లి నడుస్తున్నది. *- నన్నపునేని నరేందర్, మాజీ ఎమ్మెల్యే*

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

కేటీఆర్ అరెస్టుకు సర్కారు కుట్ర

మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

చిన్నగూడూరు (మరిపెడ), డిసెంబర్20: బీఆర్ఎస్ పార్టీని బదనాం చేసేందుకే ఫార్ములా ఈ రేస్ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేటీఆర్‌ను అరెస్టు చేసేందుకు కుట్రలు చేస్తున్నదని, దీన్ని పూర్తిగా ఖండిస్తున్నామని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం మరిపెడ లోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు దివాలాతీసి ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నదని పేర్కొన్నారు. ఇపుపడు రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని అన్నారు. అనుభవం లేని వ్యక్తిని కాంగ్రెస్ అధిష్ఠానం ముఖ్యమంత్రిని చేసిందని, తాము చేసేదే కరెక్ట్ అని, ప్రతిపక్షాలు మాట్లాడకూడదని ప్రభుత్వాన్ని విమర్శిస్తే జైలుకు పంపుతామనే సంకేతాలతో రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అన్నారు. హైడ్రా, మూసీ పేరుతో ఇండ్లను కూల్చివేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వేలాది మందిని నిరాశ్రయులను చేస్తున్నదని అన్నారు. లగచర్ల రైతులను జైలుకు పంపిన ముఖ్యమంత్రి చరిత్రను ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్ఎస్‌కు గ్రామగ్రామాన బలమైన కార్యకర్తలు ఉన్నారని, కేటీఆర్‌ను జైలుకు పంపే కుట్రలను ఉపసంహరించుకోకపోతే ప్రభుత్వంపై ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, మాజీ ఎంపీపీ వెంకన్న, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రఘు, నాయకులు రాంబాబు, రవీందర్, అయూబ్‌పాషా, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుట్రపూరితంగా రేవంత్‌రెడ్డి

కేటీఆర్‌పై సీఎం రేవంతర్‌రెడ్డి కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఫార్ములా రేస్‌తో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయిలో పోటీపడుతున్న నగరాల సరసన కేటీఆర్ నిలిపారు. ఈ రేస్‌ను కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకున్నాకే రాష్ట్రంలో నిర్వహించారు. రూ. 55 కోట్లు నేరుగా హెచ్ఎండీఏ ద్వారా ఫార్ములా సంస్థకు చెల్లింపులు జరిగాయని స్వయంగా కేటీఆర్ చెప్పారు. రేవంత్‌రెడ్డిని ఆ సంస్థకు చెందిన వ్యక్తి కలిసిన విషయాన్ని ఎందుకు దాచారు? ఇప్పుడు ఈ రేస్‌ను నిర్వహించకపోవడం వల్ల సదరు సంస్థ ప్రభుత్వంపై ఫిర్యాదు చేసింది. అసలు రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలి.

- పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

పాలనపై దృష్టిపెట్టాలి

రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన, అభివృద్ధిని పక్కకు పెట్టి అరెస్టులపై ఆసక్తి చూపుతూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నది. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే చూస్తూ ఊరుకోం. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తున్నది. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే మరో ఉద్యమం ఎగి సిపడుతుంది. ప్రతి మూడు నెలలకో కొత్త అంశాన్ని తెరపైకి తెస్తూ రేవంత్‌రెడ్డి ప్రజలను డైవర్ట్ చేస్తున్నారు. ఈ కార్ రేస్‌లో అవినీతి జరిగితే అసెంబ్లీలో చర్చపెట్టమని అడిగితే దానికి సమాధానం లేదు. నీకు దమ్ముంటే కేటీఆర్‌ని అరెస్ట్ చేసి చూడు..ఏమవుతదో తెలుస్తది.

- చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

హామీలపై నిలదీస్తున్నాడనే కేసు

మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 20 : ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అసెంబ్లీ సమావేశాల్లో ఎక్కడ నిలదీస్తారనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి కేటీఆర్‌పై అక్రమ కేసులను పెట్టిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన పెట్టి డైవర్షన్ పాలసీని అవలంబిస్తున్నాడని అన్నారు. కేటీఆర్‌ను ఏదో ఒక కేసులో ఇరికించాలనే లక్ష్యంతో ఏడాదిగా ప్రయత్నిస్తూ విఫలమవుతున్నాడని పేర్కొన్నారు. ఈ ఫార్ములా రేసులో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాలేదని, ఎవరికి కమీషన్ పోలేదని, ఒప్పందం ప్రకారమే బ్యాంకు ద్వారా నిర్వాహకులకు చెల్లించారన్నారు. కేటీఆర్ పోరాట ఫలితమే లగచర్ల రైతులు విడుదల అయ్యారన్నారు. కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేశ్, ఆకుల కుమార్, తా టికొండ సురేశ్, చల్లా చందర్ రెడ్డి, కుంబం కుమార్, మునిగెల రాజు, గుర్రం శంకర్, గాదె రాజు, మారపల్లి ప్రసాద్, గుండె మల్లేశ్, గట్టు పావని, పీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

హనుమకొండ పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

రౌడీ షీటర్లపై నిఘా!

- *సీపీ ఆదేశాలతో కదిలిన పోలీసులు*
- *నైట్ పెట్రోలింగ్‌లో ఇళ్లకు వెళ్లి తనిఖీలు*
- *రోజువారీ దిన చర్యలపై ఆరా*

నమస్తే ఎఫెక్ట్

సుబేదారి, డిసెంబర్ 20 : వరంగల్ నగరంలోని రౌడీ షీటర్ల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. కొందరు రౌడీషీటర్లు రెచ్చిపోయి భూదందాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతూ అమాయకులపై దాడులకు తెగబడుతున్న తీరును 'నమస్తే తెలంగాణ'లో 'నగరంలో రౌడీల రాజ్యం', 'ఆర్డర్ తప్పిన పోలీసు -పోలిటికల్ సపోర్ట్‌తో రెచ్చిపోతున్న రౌడీషీటర్లు' శీర్షిక పలు వరుస కథనాల్లో రౌడీల దందాలను వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా నగరంలోని రౌడీ షీటర్ల దందాలపై నిఘా పెట్టారు. పోలీసులు రాత్రి పెట్రోలింగ్ సమయంలో ర్యాండమ్‌గా ప్రతి రౌడీ షీటర్ ఇంటికి వెళ్లి తనిఖీ చేయాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో నగరంలోని మిల్స్‌కాలనీ, ఇంతెజార్‌గంజ్, మట్టెవాడ, హనుమకొండ, సుబేదారి, కేయూసీ, కాజీపేట, మడికొండ, హసన్‌పర్తి, మామునూరు పోలీసులు ప్రతిరోజు రాత్రి ఒకరిద్దరు రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి తనిఖీ చేస్తున్నారు. రౌడీల కదలిక లు, దిన చర్యపై ఆరా తీసి కౌన్సెలింగ్ చేస్తున్నారు. ఈ వివరాలను స్టేషన్ నుంచి రోజువారీ నివేదికల (డీఎస్ఆర్) ద్వారా సీపీ కార్యాలయానికి అందజేస్తున్నారు. ఈ విధానంలో ముగ్గు రు ఇన్‌స్పెక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సీపీ తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 699 మంది రౌడీషీటర్లు ఉన్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. నగరంలో 234 మంది రౌడీషీటర్లుండగా వీరిలో 70 మంది మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నారు.

ఎల్కతుర్తి ఎస్సైపై వేటు

- *విధుల నుంచి రాజ్‌కుమార్ సస్పెన్షన్*
- *ఉత్తర్వులు జారీ చేసిన వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా*
- *అవినీతి ఆరోపణలతోనే చర్యలు*

ఎస్సై రాజ్‌కుమార్

సుబేదారి/ఎల్కతుర్తి, డిసెంబర్ 20: అవినీతితో పాటు పోలీసు శాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఎల్కతుర్తి ఎస్సై గోదారి రాజ్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు శుక్రవారం వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు చేశారు. ఎస్సై రాజ్‌కుమార్ ఇసుక, పీడీఎస్ రైస్, గ్రానైట్ పరిశ్రమల నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడడంతో పాటు డిపార్ట్‌మెంట్ అనుమతి లేకుండానే ఇటీవల కరీంనగర్‌లో జరిగిన మంత్రి పొన్నం ప్రభాకర్ అన్న కుమారుడి పుట్టిన రోజు వేడుకలకు హాజరైనట్లు పోలీసు నిఘా వర్గాల విచారణలో తేలింది. దీనికి తోడు తమకు న్యాయం చేయడం లేదని పలువురు బాధితులు సీపీ, డీజీపీకి సైతం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అలాగే స్థానిక నాయకులతో విభేదాలున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఎస్సై రాజ్‌కుమార్‌ను సీపీ సస్పెండ్ చేసినట్లు తెలిసింది. రాజ్‌కుమార్ ఎల్కతుర్తిలో ఏడాదిన్నరగా పనిచేస్తున్నాడు. ఇంతకు ముందు హనుమకొండ ఎస్సైగా పనిచేసినప్పుడు కూడా ఆయనపై పలు ఆవినీతి ఆరోపణలున్నాయి. కాగా, ఎల్కతుర్తిలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై సస్పెండ్ కావడం ఇదే ప్రథమం.

హాల్‌టికెట్లు దహనం చేసి ఏఎన్ఎంల నిరసన

రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్

ఖిలావరంగల్/మహబూబాబాద్/ములుగు రూరల్, డిసెంబర్ 20: రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఎన్ఎంలు శుక్రవారం హాల్‌టికెట్లు దహనం చేసి నిర సన తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న అన్ని రకాల ఏఎన్ఎంలు తమ సమస్యలు పరిష్కరించాలని వరంగల్, ములుగు డీఎంహెచ్‌వో కార్యాలయాల ఎదుట, మహబూబాబాద్‌లో ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా చేస్తున్న నిరసన శుక్రవారం ముగిసింది. ఇందులో భాగంగా ఏఎన్ఎంలు హాల్‌టికెట్లను దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే యాదానాయక్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్ఎంలు 24 ఏళ్ల నుంచి రెగ్యులర్ కాకపోవ డం దుర్మార్గమన్నారు. రాత పరీక్ష వాయిదా వేయకపోతే ఈ నెల 22న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర కమిటీ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ములుగులో దీక్షకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మద్దతు తెలిపారు.

వరంగల్ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట హాల్ టికెట్లను దహనం చేస్తున్న ఏఎన్ఎంలు

అమిత్‌షా వ్యాఖ్యలపై ఆగ్రహ జ్వాలలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కేంద్ర హోంమంత్రి దిష్టిబొమ్మల దహనం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలపై సర్వత్రా ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. షా చేసిన వ్యాఖ్యలు అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించేలా ఉన్నాయని, వెంటనే ఆయన భారత ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలు దళిత సంఘాల తోపాటు వివిధ రాజకీయ పార్టీలు శుక్రవారం ఆందోళనలు చేపట్టాయి. పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశాయి. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారా చట్టసభల్లోకి వచ్చిన అమిత్‌షా బాధ్యత గల కేంద్ర హోంమంత్రిగా ఉండి మతోన్మాదిగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వెంటనే అమిత్‌షాను పదవి నుంచి తొలగించి, ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు.